క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌ సీపీ మండల స్థాయి సమావేశం

చల్లపల్లి: వైఎస్‌ఆర్‌ కాంగ్రెస్‌ పార్టీ చల్లపల్లి మండల స్థాయి సమావేశం స్థానిక అగ్రహారంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు అబ్దుల్‌ అర్షద్‌ ఆదివారం తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు హాజరవుతారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరు కావాలన్నారు.

పీఏసీఎస్‌ మాజీ చైర్‌పర్సన్‌కు పరామర్శ



మోపిదేవి: మండల పరిధిలోని కోసూరువారిపాలెం పీఏసీఎస్‌ మాజీ చైర్‌పర్సన్‌ కోసూరు కోటేశ్వరరావును అవనిగడ్డ మాజీ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో చెయ్యి విరిగి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసి రమేష్‌బాబు వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ గరికిపాటి వెంకటేశ్వరావు, ఎస్సీ సెల్‌ మండల కన్వీనర్‌ చోడబత్తిన పూర్ణచంద్రరావు, జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, లింగం జగదీష్‌కుమార్‌ తదితరులు ఉన్నారు.

ప్రసాద్‌ మృతికి సంతాపం



అవనిగడ్డ: వైఎస్సార్‌ సీపీ ఎస్టీ నేత గుగ్గిలోతు ప్రసాద్‌(54) మృతికి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు. ప్రసాద్‌కు గుండెపోటు రాగా విజయవాడలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మరణించాడు. పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యంలో ఆయన స్వగృహానికి ప్రసాద్‌ భౌతికకాయాన్ని తీసుకొచ్చారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి ప్రసాద్‌ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రసాద్‌ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌ సీపీ పంచాయతీరాజ్‌ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జైగోపాల్‌, నాయకులు చింతలపూడి బాలు, సామర్ల రాముడు, గరికపాటి కృష్ణారావు, కార్యకర్తలు ఉన్నారు.

ఏపీ హైకోర్టు ఆన్‌లైన్‌ ఎగ్జామ్‌కు 378 మంది హాజరు



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవీ ఇంజినీరింగ్‌ కళాశాలలో ఆదివారం ఆంధ్రప్రదేశ్‌ హైకోర్టు ఆన్‌లైన్‌ ఎగ్జామ్‌కు 378 మంది హాజరయ్యారని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ బీఆర్‌ఎస్‌ రెడ్డి, అడ్మిన్‌ పి.అశోక్‌కుమార్‌ తెలిపారు. మూడు సెషన్స్‌లలో జరిగిన ఈ పరీక్షకు ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు మొదటి సెషన్‌లో 180 మందికి గాను 124 మంది, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 180 మందికి గాను 126 మంది హాజరయ్యారన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు జరిగిన మూడో సెషన్‌లో 180 మందికి గాను 130 మంది హాజరయ్యారని, మొత్తం మూడు సెషన్లకు 540 మందికి గాను 378 మంది హాజరయ్యారని, 162 మంది గైర్హాజరయ్యారని వారు తెలిపారు.

సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఘంటసాల: సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చల్లపల్లి సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ కె.ఈశ్వరరావు అన్నారు. ఘంటసాల సచివాలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి పల్లె నిద్రలో భాగంగా సైబర్‌ నేరాలు, సోషల్‌ మీడియా, దొంగతనాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సీఐ ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం అందరూ సెల్‌ ఫోన్లు విస్తృతంగా వినియోగిస్తున్నారని, సైబర్‌ నేరగాళ్లు రకరకాల యాప్‌లు, ఏపీకే ఫైల్స్‌ పంపించి వివిధ పథకాలు, నగదు వస్తాయని మేసేజ్‌లు పంపి అకౌంట్లను ఖాళీ చేస్తున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఘంటసాల ఎస్‌ఐ కె.ప్రతాప్‌రెడ్డి, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గణనాథులు సిద్ధం!

- జోరందుకున్న విక్రయాలు
- ఈ నెల 27న వినాయక చవితి
- చురుగ్గా సాగుతున్న పందిళ్ల ఏర్పాటు



తుదిమెరుగులు దిద్దుతున్న మహిళలు



పెడనలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన వినాయకుని ప్రతిమలు

పెడన: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గణనాథుల విగ్రహాలను విక్రయానికి సిద్ధం చేశారు. వాడవాడలా చలువ పందిళ్లను ఏర్పాటు చేసి ప్రతిమలను పెట్టి గణపతి నవరాత్రి మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా వినాయక విగ్రహాల కొనుగోలుకు వివిధ ప్రాంతాల నుంచి పెడనకు వస్తున్నారు. గత నెల రోజులుగా పట్టణంలోని మచిలీపట్నం రోడ్డులోని రైల్వేగేటు సమీపంలో వేముల గోవర్ధనరావు విగ్రహాలు తయారు చేయడంలో తలమునకలయ్యారు. గత పదేళ్లకు పైగా ఇదే వృత్తిలో ఉంటున్నారు. ఈ ఏడాది ముందుగానే వివిధ ప్రాంతాలకు చెందిన వారు విగ్రహాలకు అడ్వాన్సులు ఇచ్చి బుక్‌ చేసుకోవడం విశేషం. అడుగు నుంచి పది అడుగుల విగ్రహాలు వివిధ రూపాలలో ఆకట్టుకుంటున్నాయి. శివపార్వతులు, వినాయకుని ప్రతిమలతో ఆకర్షణీయంగా తయారు చేశారు. మరికొన్ని విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్నారు. వాడవాడలా చలువ పందిళ్ల ఏర్పాట్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి.

విగ్రహాలు ముందుగానే బుక్‌ అయ్యాయి



విగ్రహాలను ముందుగానే బుక్‌ చేసుకున్నారు. జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి కూడా వస్తున్నారు. ఏలూరు, ఎన్టీఆర్‌ జిల్లాల నుంచి కూడా విగ్రహాలను చూడటానికి వస్తున్నారు. కొన్ని ముందుగానే బుక్‌ చేసుకున్నారు. నూజివీడు నుంచి కూడా వచ్చారు. రూ.1,500 నుంచి రూ.30 వేల వరకు ధర పలుకుతోంది.

– వేముల గోవర్ధనరావు, విగ్రహాల తయారీదారుడు, పెడన

పేదలకు అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వం

అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు



పెదకళ్లేపల్లిలో లక్ష్మణరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 14 నెలల కాలంలో పేదలకు తీరని అన్యాయం చేస్తోందని అవనిగడ్డ నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు విమర్శించారు. మండలంలోని పెదకళ్లేపల్లి గ్రామంలో ఆదివారం పర్యటించిన ఆయనకు పింఛన్లు కోల్పోయిన పలువురు దివ్యాంగులు తమ ఆవేదనను వెళ్లబుచ్చారు. తాడేపల్లి లక్ష్మణరావు తాటిచెట్టు పైనుంచి పడి అర్ధ శరీరభాగం 75 శాతం పనిచేయకపోవడంతో 2020 నుంచి దివ్యాంగుల పింఛన్‌ అందుకుంటున్నానని, కూటమి ప్రభుత్వం పింఛన్‌ తొలగించిందని వాపోయారు. కేతరాజు నాగమల్లేశ్వరమ్మకు కన్ను పోయిందని, అరజా గోపాల్‌ చేయి విరిగిపోయిందని, శేషగిరి కన్నుపోయిందని వివరించారు. అనంతరం రమేష్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి పేదలకు అన్యాయం చేస్తూ ధనికులకు అనుకూలంగా పనిచేస్తుందని దుయ్యబెట్టారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తానని మోసం చేసి వారిని పక్కన పెట్టారుని, అర్హత ఉన్నా దివ్యాంగులకు వచ్చే పింఛన్‌ను తొలగించారని విచారం వ్యక్తంచేశారు. వ్యవసాయ రంగంలో యూరియా ఎరువు కొరత సృష్టించడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రతి పనిలోనూ కూటమి ప్రభుత్వం పేదవాడికి తీవ్ర అన్యాయం చేస్తుందని చెప్పారు. ఇది ఆర్థిక సంపన్నులకు మాత్రమే ఉపయోగపడే ప్రభుత్వమన్నారు.

దివ్యాంగులతో ఆందోళనకు సిద్ధం..

అమరావతిలో భూములు ఉన్నవారికి, అక్కడ భూములు కొనగలిగే వారికి మాత్రమే కూటమి ప్రభుత్వం ఉపయోగపడుతుందని రమేష్‌బాబు చెప్పారు. గతంలో అమ్మ ఒడిని తల్లి దీవెనగా మార్చి గత సంవత్సరం ఎవ్వరికి ఇవ్వలేదని, చివరి సంవత్సరం కూడా ఉండదని, జనాలకు మసిపూసి మారేడికాయ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ ఈ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసం అర్థమైందన్నారు. ఎవరు మెప్పు కోసమో పర్సంటేజ్‌ తగ్గించి దివ్యాంగులకు అన్యాయం చెయ్యవద్దని, ఇప్పటికైనా ఈ దుర్మార్గమైన ప్రభుత్వం పింఛన్ల విషయంలో కళ్లు తెరచి పింఛన్లు యధావిధిగా పంపిణీ చేయాలన్నారు. లేనిపక్షంలో మండలంలో తహసీల్దార్‌ కార్యాలయం, జిల్లా స్థాయిలో కలెక్టర్‌ కార్యాలయం వద్ద దివ్యాంగులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కోడూరు మండలంలో భూపతి నాగమణి పెట్టుడు కన్నుతో జీవిస్తుండగా ఆమె పింఛను కూడా తొలగించడం అన్యాయమని చెప్పారు. మండల పార్టీ కన్వీనర్‌ గరికిపాటి వెంకటేశ్వరావు, గ్రామ పార్టీ కన్వీనర్‌ గండు దుర్గారావు, మాజీ సర్పంచ్‌ అరజా వెంకట సుబ్బారావు, మండల ఎస్సీసెల్‌ కన్వీనర్‌ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, లింగం జగదీష్‌కుమార్‌, అరజా వెంకట చలపతిరావు, తలపుల సుధాకర్‌, ఆది, బడే రామాంజనేయులు, తోట మురళీ కృష్ణ పాల్గొన్నారు.

నిధులు తేవడంలో ఎమ్మెల్యే కాగిత విఫలం



మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాము



విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

- వైఎస్సార్‌ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము

బంటుమిల్లి: జెడ్పీ నిధులతో నిర్మించిన నిర్మాణాలు ప్రారంభోత్సవం చేసుకుంటూ పెడన నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తేవడం చేతకాని వ్యక్తి పాలకునిగా ఉండటం దురదృష్టకరమని వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్‌(రాము) ఆరోపించారు. స్థానిక గీతా మందిరం ఆవరణలో బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాల్లో భాగంగా మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల నాగేశ్వరరావు అధ్యక్షతన మండల స్థాయి విస్తృత సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాము పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌పై తనదైన శైలిలో ధ్వజమెత్తారు.

ఇచ్చిన మాట కోసం వెనుతిరిగేది లేదు..

ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉండి తాము నాలుగు నెలల కాలంలో తెచ్చిన నిధులు కాగిత కుటుంబం వారి జీవిత కాలంలో పెడన నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తెచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. ఎమ్మెల్యే ఇంటికి వెళ్తున్న మల్లేశ్వరం తాగునీరు కూడా జెడ్పీ నిధుల నుంచి చేసిన మరమ్మతుల ద్వారా వచ్చినవేనన్నారు. జెడ్పీ నిధులతో చేసిన అభివృద్ధి పనులు నిస్సిగ్గుగా ప్రారంభం చేసుకుంటూ నిధులు మంజూరు చేసిన చైర్‌పర్సన్‌కు ఆహ్వానం లేకపోవడం మీ సంస్కారానికి అద్దం పడుతోందని విమర్శించారు. 14 నెలల కాలంలో నియోజకవర్గంలో ఉపాధి పథకం నిధులు తప్ప ప్రభుత్వం నుంచి ఏమైన నిధులు తెచ్చి పనులు చేశావా అని ఎమ్మెల్యే కాగితపై రాము చాలెంజ్‌ చేశారు. తనకు గాని, తన కుటుంబానికి గాని కమీషన్లు, వాటాలు అవసరం లేదని, ఇచ్చిన మాట కోసం వెనుతిరిగేది లేదని రాము స్పష్టం చేశారు.

కష్టపడే వారికి గుర్తింపు..

చంద్రబాబు చెబుతున్న సంపద సృష్టి ఎమ్మెల్యే కాగిత జేబులు నింపుకోవడానికి ఉపయోగపడిందని రాము ఆరోపించారు. జగనన్న నన్ను నమ్మారు.. మీరు నన్ను నమ్మి పార్టీ గెలుపు కోసం కృషి చేయండి, కష్టపడ్డవారికి తగిన గుర్తింపు ఎప్పుడు ఉంటుందని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు రాము భరోసా ఇచ్చారు. మండల, గ్రామ స్థాయిలో అంకితభావం, నమ్మకం కలిగిన వ్యక్తులకు బాధ్యతలు అప్పగించండిగాని పేరు చెప్పుకునేవారికి వద్దని నిర్మోహమాటంగా ఆయన నాయకులను హెచ్చరించారు. పార్టీ కష్టంలో ఉన్నప్పుడే నాయకులు, కార్యకర్తలు అండగా ఉండాలి అప్పుడే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు. తొలుత దివంగత నేత వైఎస్‌.రాజశేఖర్‌రెడ్డి, ఉప్పాల రాంప్రసాద్‌ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ అనుబంధ శాఖల జిల్లా, మండల ప్రతినిధులు తిరుమాని శ్రీనివాసరావు, రామానాయుడు, మహంతిప్రసాదు, బాబూరావు, చంద్రశేఖర్‌, పాము పుష్ప, ఎంపీపీ వి.చినబాబు, వైస్‌ ఎంపీపీ చిన్నారిబాబు తదితరులు బాబు షూరిటీ–మోసం గ్యారంటీ బాబు చేపట్టిన ప్రజా వ్యతిరేక పాలనపై పలు ఉదాహరణలతో కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, ఎంపీటీసీలు ఎండీ కమాల్‌బాషా, పేపేటి వీరబాబు, సర్పంచ్‌ బి.రమేష్‌, పార్టీ అనుబంధ శాఖల అధ్యక్షులు మురళి, నరేష్‌, సుబ్బారావు, జనార్దన్‌రావు, పాండురంగారావు, వెంకటేశ్వరరావు, సాయిబాబు, కుటుంబరావు, నాయకులు కె.శ్రీనివాసరావు, శేషగిరి, రాఘవులు, గాంధీ, రాధాకృష్ణ, పలు గ్రామాల నుంచి కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రామును గజమాలతో సత్కరించారు.

నేడు కలెక్టరేట్‌ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి



పెదప్రోలు(మోపిదేవి): ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలను అమలు జరపాలని కోరుతూ ఈ నెల 25వ తేదీ సోమవారం ఉదయం మచిలీపట్నం కలెక్టరేట్‌ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రజక వృత్తిదారుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పెదప్రోలు అంకాలమ్మ తల్లి గుడి వద్ద ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అవనిగడ్డ రజనీకాంత్‌, జిల్లా అధ్యక్షురాలు కళ్లేపల్లి లక్ష్మీ, సంఘం సభ్యులు కళ్లేపల్లి సుబ్బారావు, కళ్లేపల్లి అరుణకుమారి, కొండపల్లి కనకదుర్గ, కళ్లేపల్లి కనకదుర్గమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

చిరస్మరణీయులైన సేవా మూర్తులు ధన్యులు



గోగినేనిపాలెం(ఘంటసాల): పేదలకు విస్తృత సేవలందించి చిరస్మరణీయులైన సేవా మూర్తులు మాలెంపాటి సీతారామాంజనేయులు, అత్తలూరి వెంకట పిచ్చియ్య ధన్యులని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ అన్నారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెంలో గ్రామ మాజీ సర్పంచ్‌, మాజీ సీడీసీ చైర్మన్‌, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు దివంగత మాలెంపాటి సీతారామాంజనేయులు కాంస్య విగ్రహం, ఎన్జీ రంగా జెడ్పీ హైస్కూల్‌ వ్యవస్థాపకులు దివంగత అత్తలూరి వెంకట పిచ్చియ్య విగ్రహాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌తో పాటు ఎన్నారై గొర్రెపాటి రంగనాథ బాబు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ గొర్రెపాటి రామకృష్ణ, నేతలు పరుచూరి సుభాష్‌ చంద్రబోస్‌, సీతారామాంజనేయులు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. సీతారామాంజనేయులు సేవలు ఆదర్శనీయమని జెడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వేమూరి వెంకట్రావులు అన్నారు. విగ్రహావిష్కరణలో వైఎస్సార్‌ సీపీ నేతలు పాల్గొని విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి సేవలను కొనియాడారు. అనంతరం సీతారామాంజనేయులు కుమార్తెలు రాజేశ్వరి – కోటేశ్వరరావు, ఎన్నారై యనమదల మాధవి కుటుంబ సభ్యులను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు వేమూరి ప్రవీణ్‌, కుంపటి నాగేంద్ర బాబు, కుంపటి శరత్‌ బాబు, సత్యం, గణపనేని వెంకటేశ్వరరావు, కుంపటి బసవయ్య పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో డీఎస్సీలో విజయం



కోటేశ్వరరావుకు స్వీటు తినిపిస్తున్న భార్య నాగేశ్వరి



స్వరూపరాణికి స్వీటు తినిపిస్తున్న భర్త శివబాబు

కొడాలి(ఘంటసాల): కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, కృషి పట్టుదల, నిబద్ధతతో చదివితే విజయం వరిస్తుందని నిరూపించారు ఘంటసాల మండలం కొడాలి గ్రామానికి చెందిన పెనుమూడి కోటేశ్వరరావు, తరకటూరి స్వరూప రాణి. ఒకే గ్రామానికి చెందిన అభ్యర్థులు జోన్‌ 2 తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల స్థాయి, కృష్ణా జిల్లా స్థాయి మొదటి ర్యాంకులు సాధించి తమ సత్తా చాటారు.

తొలి ప్రయత్నంలోనే విజయం

ఎమ్మెస్సీ బీఎడ్‌ పూర్తి చేశా. మొదటిసారి డీఎస్సీ రాసి విజయం వరించడంతో ఉద్యోగానికి ఎంపికయ్యా. మెగా డీఎస్సీలో 56 మార్కులు సాధించి పీజీటీ లెక్కలు జోన్‌ – 2 అనగా తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాల పరిధిలో ఓపెన్‌ కేటగిరిలో 69వ ర్యాంకు, ఎస్సీ గ్రూపు 2 కేటగిరిలో మొదటి ర్యాంకు వచ్చింది. ప్రైవేట్‌ పాఠశాలలో టీచరుగా పని చేస్తూనే డీఎస్సీకి సిద్ధపడేందుకు కొడాలి గ్రామంలోని గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతూ ప్రిపేర్‌ అయ్యాను. చివరి రెండు నెలలు సోషల్‌ వెల్ఫేర్‌ ఫ్రీ కోచింగ్‌కు ఎంపికై విసన్నపేటలో కోచింగ్‌ తీసుకున్నాను. భార్య నాగేశ్వరి, అక్క, అన్న, వదినలు, మిత్రుల ప్రోత్సాహంతో చదివి విజయం సాధించాను.

– పెనుమూడి కోటేశ్వరరావు, కొడాలి

18 గంటలు శ్రమించా..

నా తల్లిదండ్రులు యోహాను, సమాధానం నన్ను టీచర్‌ను చేయడం వారి ఆశయం. పెళ్లి అయిన తర్వాత కొడాలి గ్రామం వచ్చాక నా ఆసక్తిని గమనించిన భర్త శివబాబు, అత్తమామలు కృపారావు, అమ్మాజీ ప్రోత్సహించడంతో కష్టపడి చదివా. 2018లో మొదటి ప్రయత్నంలో కొద్ది మార్కుల్లో డీఎస్సీ కోల్పోవడంతో బంధువులు, మిత్రులు టీచర్‌ అవడం కష్టం అన్నారు. దీంతో వారి మాటలతో మరింత పట్టుదల, కృషితో ప్రతి రోజు 18 గంటల పాటు శ్రమించా. మెగా డీఎస్సీలో 82.5786 మార్కులు సాధించి ఎస్‌జీటీలో ఓపెన్‌ కేటగిరిలో 143 ర్యాంకు, బీసీ.సీలో కృష్ణాజిల్లాలో మొదటి ర్యాంకు సాధించాను.

– తరకటూరి స్వరూప రాణి, కొడాలి

ఉత్తమ అధికారులకు సన్మానం



భానుమూర్తిని సన్మానిస్తున్న నిర్వాహకులు



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న సీఐ ఈశ్వరరావు

మచిలీపట్నంటౌన్‌: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగ అవార్డులను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా అధికారుల చేతుల మీదుగా అందుకున్న జిల్లా ఉద్యోగ ఉపాధి శిక్షణా అధికారి దేవరపల్లి విక్టర్‌ బాబు, జిల్లా ప్రభుత్వాస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్‌, నేత్ర విభాగాధిపతి జి.భానుమూర్తిలను ఆదివారం ఘనంగా సన్మానించారు. మలకాపట్నం గుప్తా సెంటర్‌లో గంధ్రపు శీనయ్య మాస్టర్‌ అధ్యక్షతన మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. మాజీ కౌన్సిలర్‌ గూడవల్లి నాగరాజు, విశ్రాంత ఇన్‌చార్జి ఎంపీడీఓ పెనుమచ్చ మధు, ఎంఈఎఫ్‌ జిల్లా ఉపాధ్యక్షుడు జుజ్జవరపు అనిల్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శి బీడెల్లి మరియకుమార్‌, న్యాయవాదులు గుర్విందపల్లి విజయబాబు, అద్దేపల్లి నిరంజన్‌రావు, కొడమంచిలి చంద్రశేఖర్‌, కొడాలి అజయ్‌ కుమార్‌, బి.విజయ్‌ కుమార్‌, చిట్టూరి యువరాజు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికి అవార్డులు అవే వస్తాయి

చల్లపల్లి: మన పని మనం చూసుకుంటూపోతే గుర్తింపు దానంతట అదే వస్తుందని దానికి డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావే ఉదాహరణ అని చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు అన్నారు. మచిలీపట్నం డీఆర్వో ఆఫీసులో సీసీగా పనిచేస్తున్న తూము వెంకటేశ్వరరావు స్వాతంత్య్ర వేడుకల్లో ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. దీన్ని పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్‌ పార్కులో వాకర్స్‌ అసోసియేషన్‌ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం తూము వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ మాట్లాడుతూ.. ఎవరు ఏపని మీద కలెక్టరేట్‌కు వచ్చినా వెంటనే వారి పని పూర్తిచేయించి పంపిస్తూ అందరి మన్ననలు అందుకున్న వెంకటేశ్వరరావుకు ప్రతిభా పురస్కారానికి అర్హుడన్నారు. పంచాయతీ ఉపసర్పంచ్‌ ముమ్మనేని రాజకుమార్‌, రిటైర్డ్‌ ఈవోఆర్డీ దాసి సీతారామరాజు, నంది అవార్డు గ్రహీత బోలెం రామారావు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైతేపల్లి దాస్‌, రిటైర్డ్‌ ఉపాధ్యాయులు తాతారావు, వార్డు సభ్యులు శీనమ్మ, మోర్ల శివ, వాకర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

లెగసీ వేస్ట్‌ డంపింగ్‌ యార్డు పరిశీలన



డంపింగ్‌ యార్డ్‌లో చెత్త నిల్వలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

మచిలీపట్నంటౌన్‌: సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో లెగసీ వేస్ట్‌ను అక్టోబర్‌ 2వ తేదీ నాటికి పూర్తిగా తొలగిస్తామని రాష్ట్ర మున్సిపల్‌ శాఖ మంత్రి నారాయణ అన్నారు. నగరంలోని డంపింగ్‌ యార్డ్‌ను ఆయన అధికారులతో కలసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 85 లక్షల లెగసీ వేస్ట్‌ ఉందని దీనిలో ఇప్పటి వరకూ 72 లక్షల టన్నుల చెత్తను తొలగించామన్నారు. మచిలీపట్నంలో మొత్తం 42 వేల టన్నుల చెత్తకు గాను 19 వేల టన్నులు పూర్తిగా తొలగించామని చెప్పారు. ఇక్కడ అదనంగా మెషీన్లు ఏర్పాటు చేసి త్వరితగతిన చెత్త తొలగించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజల రోగాలకు కారణమయ్యే ఘన, ద్రవ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా సీఎం చంద్రబాబు చెత్త నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి రోజూ వచ్చే 7,500 టన్నుల సాలిడ్‌ వేస్ట్‌ కోసం వేస్ట్‌ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ద్రవ వ్యర్థాల నిర్వహణ కోసం రాబోయే రెండేళ్లలో వాటర్‌ ట్రీట్‌మెంట్‌ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మంత్రి పర్యటనలో అసిస్టెంట్‌ కమిషనర్‌ ఎం.గోపాలరావు, ఇతర అధికారులు ఉన్నారు.

చవితి పందిళ్లకు అనుమతులు తప్పనిసరి



మాట్లాంలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐలు

గూడూరు: వినాయక చవితిని పురస్కరించుకుని నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని గూడూరు ఎస్‌ఐ కేఎస్‌వీ సత్యనారాయణ స్పష్టం చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవడానికి ప్రజలంతా పోలీసులకు సహకారం అందించాలని కోరారు. దీనికోసం ప్రభుత్వం ఈ ఏడాది పలు మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. మండల పరిధిలో గణేష్‌ మండపాలు ఏర్పాటు చేసేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉత్సవాలకు డీజే అనుమతి లేదని ఆయన చెప్పారు.

చవితి ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదు

కృత్తివెన్ను: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఊరేగింపుల్లో డీజేలు, అశ్లీల నృత్యాలకు ఎటువంటి అనుమతులు లేవని కమిటీల వారు దీనిపై సరైన అవగాహనతో పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ పైడిబాబు అన్నారు. ఆదివారం మాట్లాం గ్రామంలో చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక ఉండేలా పీస్‌ కమిటీలను ఏర్పాటు చేశారు. పందిళ్ల వద్ద, ఊరేగింపుల్లో రాజకీయ విద్వేషాలు రగిలించేలా పాటలు పెట్టరాదన్నారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా కమిటీలదే పూర్తి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో శిక్షణ ఎస్‌ఐ జగదీష్‌, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, కుట్టుమిషన్‌ అందజేత



మచిలీపట్నంటౌన్‌: వాసవీ క్లబ్‌ క్యాలెండర్‌ ఆఫ్‌ ఈవెంట్స్‌లో భాగంగా ఆదివారం రాధాకృష్ణ జోన్‌ సోషల్‌ కార్యక్రమం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. విజయవాడ రోడ్‌లోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జోన్‌లోని మచిలీపట్నం, నాగాయలంక, కోడూరు, గుడివాడ నాలుగు క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొని సిల్వర్‌ హౌసీ, శారీ హౌసీ, కిచెన్‌ హౌసీ, వన్‌ మినిట్‌ గేమ్స్‌, లక్కీ డిప్స్‌, సిల్లీ క్వశ్చన్స్‌ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. సభ్యులందరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు, ఓ మహిళకు కుట్టుమిషన్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్‌ ఇంటర్నేషనల్‌ ప్రోగ్రామ్‌ కోఆర్డినేటర్‌ యెండూరి సురేష్‌ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, క్లబ్‌ జోనల్‌ సోషల్‌ డిస్ట్రిక్ట్‌ ఇంచార్జ్‌ రమణబాబు, జిల్లా గవర్నర్‌ అన్నం సాయి సునీత, క్యాబినెట్‌ సెక్రటరీ ఆలపాటి సత్యనారాయణరావు, ఇంటర్నేషనల్‌ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ శ్రీకాకుళపు రేణుక రాణి, రీజనల్‌ చైర్‌పర్సన్‌ వీఎన్వీ శిరీష, రీజనల్‌ సెక్రటరీ అన్నం అశోక్‌, క్యాబినెట్‌ జాయింట్‌ సెక్రెటరీ జల్లూరి దివ్యశ్రీ పాల్గొన్నారు.